# రివర్స్ గేర్లు

కార్లకి, లారీలకి బస్సులకి రివర్స్ గేర్లున్నట్టే మనక్కూడావుంటాయి. కొన్ని కొన్ని సందర్భాలలో పరిస్థితుల్లో రివర్స్‌లో వెళితేనే పన్లవుతాయి. ముక్కుకి సూటిగా వెడితే చుక్కెదురవుతుంది. అంచేత పరిస్థితిని అంచనా వేసుకుని గేరుమార్చి గేమ్ గెలవాలి. మొన్న జరిగిన వరల్డు కప్పు ఆటలు చూసినవాళ్ళు చండ ప్రచండులయి విజృంభిస్తున్నప్పుడు బంతిని పట్టించుకోకుండా వాళ్ళ కాళ్ళ భరతం పట్టడం. దీన్నే రివర్స్ గేరంటారు. కాలేజీ సీటుకోసం ప్రిన్సిపాలుగారి కాళ్ళావేళ్ళా పడి బతిమాలితే పన్జరగనప్పుడు , రివర్స్‌లో వెళ్ళి రెచ్చిపోండి. ఎవరిదగ్గర ఎంతెంత డొనేషన్ల పట్టేవోనాకు తెల్సు, నీ గుట్టు రట్టు చేస్తానని నోరుచేసుకుంటే రహస్యంగా సాయంత్రం రమ్మంటాడు. అలాగే రేషన్ షాపుల్లోగూడా షుగరు లేదంటే రిజిష్టర్లు అడగండి.... సంచీ పట్టండంటారు షుగరుకి , వీటుకి . రివర్స్ గేర్ ప్రతిభ చెప్పలేం.

పేకాటల్లోను, పార్టీల్లోనూ కూర్చున్నప్పుడు ఇళ్ళు మర్చిపోయి, రోజూ ఆలస్యంగా ఇంటికి చేరే పతిపుంగవులకి రివర్స్ గేర్ కవచం లాంటిది. అర్ధరాత్రి ఇంటికి చేరి భార్య తలుపు తీయగానే , ఆవిడికి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ఎంత సేపు, వెధవ మొద్దు నిద్రా నువ్వూనూ అంటూ కాస్సేపు నోరు పారేసుకుని రెచ్చిపోతే , అవతలి పక్షం వీకయ్యిపోతుంది. అంతే, జెండా ఊంచా రహే హమారా అన్నట్లు భోంచేసి హాయిగా తొంగోండి. మనలాగే ఇల్లాళ్ళూ ఈ రివర్స్‌గేర్‌ని వాడుతూ వుంటారు. కాని మనకి తెలిచ్చావదు. మీరు నిద్ర లేచేసరికి, వంటగదిలోంచి భయంకరమైన శబ్దాలు వినిపిస్తుంటాయి. గ్లాసులు , పళ్ళేలు గాలిలో ఎగురుతున్నట్లు గ్రహిస్తారు. అంతలోపిల్లల ఏడుపులు , ఆ వెనకేమో శ్రీమతి గొంతులో తిట్ల పని .....పిల్లల్ని , పనిమనిషిని , పాలవాడ్ని , ఆవిడ్ని కన్నందుకు ఆవిడ తల్లితండ్రుల్ని ..... కలిపి కాస్సేపు రకారకాల తిట్లు వినబడతాయి. దాంతో మీరు ఆలోచనలో పడతారు. ఏం తప్పు చేశానబ్బా అంటూ రెండ్రోజులు వెనక్కెళ్ళి ఆలోచిస్తారు. కాని చెప్పుకోదగ్గ తప్పేం కనబడదు. వాతావరణం ఉద్రిక్తతగా వుండడంతో ఆకల్లేదని చెప్పి బయటపడతారు. సాయంత్రం తిరిగొచ్చేసరికి వాతావరణం రివర్స్‌లో వుంటుంది. పిల్లలు, పని మనుషులు , పాలవాళ్ళు అంతా సంతోషంగా కనిపిస్తారు. లోనికి అడుగుపెట్టగానే మీ శ్రీమతిగారు ముందు కాఫీ ఇచ్చి తర్వాత, చూపిస్తుంది వెయ్యి రూపాయలు పట్టు చీర . తుపాను

వెలసినందుకు అమాయకంగా సంతోషపడతారేమో గాని, వెయ్యి రూపాయలు జరిమానా పడిందన్న సంగతి స్ఫురించదు. ఆడవాళ్ళు ఏ గేరయినా సరే ఆడ్వాన్స్‌గా వేస్తారు. కేవలం రివర్స్ గేర్నే నమ్ముకుంటే అవస్థలో పడటం ఖాయం. ప్రయాణం చేస్తున్న రోడ్డునిబట్టి ఏ గేర్‌లో వెళ్ళాలో నిర్ణయించటం ఉత్తమ డ్రైవర్ లక్షణం. ప్రజా నాయకులకి ఈ రివర్స్ గేర్లు అస్సలు పనికిరావు. పాయిజన్లాగా పనిచేస్తాయి. పదవిలోకి రాగానే రివర్సులో ప్రజల్ని తిడితే ఓట్లు పుట్టవ్. నవ్వుతూనే నమ్మకంగా పనిచేసుకుపోవాలి. అలాగే ఆడపెళ్ళివారు కూడా ఈ రివర్స్ గేరు గురించి మర్చిపోవాలి. అంతేకాని విడిదిలో వాళ్ళకి వేడి నీళ్ళు కావాలట కబురొస్తే , రివర్సులో రెచ్చిపోయి , వేడినీళ్ళా వాళ్ళ మొహాలా ? చెరువులో గేదెల్లాగా పోక్రీ వెధవలకంటూ మొదలెట్టారో కల్యాణ మండపం కాస్తా కొట్లాట గోదా అయితీరుతుంది. అంచేత ముహూర్తం అయ్యేదాకా సాంప్రదాయ గేర్నివాడి బండీని నడవనివ్వాలి. అంత ముచ్చటగా వుంటే కావాలంటే అప్పగింతలప్పుడు రివర్స్ గేర్ వాడొచ్చు, బావగారూ అనిపిలిస్తే పట్టించుకోకండి. అప్పటికి కమిటయిపోయారు కాబట్టి కిక్కురమనకుండా లేచక్కా పోతారు.

ఈ మధ్యన రైల్లో నాకో పెద్ద మనిషి తగిలాడు. తగిలాడంటే కాళ్ళకి తగిలాడని కాదు. పరిచయం అయ్యాడు. పరిచయం చేసుకుని పని ప్రారంభించేడు – ఉపన్యాసం : సామాజిక స్పృహ గురించి, పెరిగి పోతున్న స్వార్థం గురించి, చెప్పుకొచ్చివర్రీ ప్రకటించేడు. తనెంత విశాల హృదయుడో ఎన్నెన్ని దానాలు చేసాడో, కాఫీ హోటల్లోరేట్ల పట్టీలాగా గడగడా చెప్పి, పొలైట్‌గా పేపరిస్తారా అనడిగాడు. అప్పటికే శక్తి హీనుడనయిపోవడంతో పేపరిచ్చా. తిరిగివ్వకుండానే తప్పుకున్నాడు. అపుడు నా కర్థమయ్యింది. రివర్స్ గేర్ని ఎంత ఘాటుగా వాడేడో ! దీన్నె బ్రయిన్ వాషని మెంటల్లీ ప్రిపేర్ చెయ్యటం అని అంటుంటారు. అంచేత ఈ ఫీల్డులో మహానుభావులున్నారు. మొహం చూసి ఏ గేర్ వాడాలో ఇట్టే చెప్పేస్తారు.

ఏది ఏమైనా కారు మనది, గేరు మనది అన్జెప్పి ఇష్టం వచ్చినట్లు వాడేసి దుబారా చేసుకోకూడదు. రోడ్డు మనది కాదన్న సంగతి గుర్తుంచుకోవాలి. కన్ను నీదని , గేరు నీదని వృథా చేస్తే విరగదా యాక్సిలు అనాల్సుంటుంది. అంచేత విజ్ఞత , సహనం వెనకా ముందూ చూసుకుంటూ సాగిపోతేనే . జీవనయాత్ర సుఖమయం అవుతుంది. రివర్స్ గేర్ని రిజర్వులో వుంచుకుని పొదుపుగా వాడుకోండి . మీకంతా మంచే జరుగుతుంది. సుఖీభవ.

------- అయ్యిపోయింది -------